www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 26 ఏప్రిల్ 2024 | 8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి

ఆ నాలుగుపైనే.. అందరి దృష్టి..!

రసవత్తరంగా ఎన్నికల సమరం

ఆచంట, ఉండి, దెందులూరు, భీమవరంపైనే అంతటాచర్చ

గెలుపోటములపై పందేల జోరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల సమరం రసవత్తరంగా మారింది. గెలుపోటములపై ఎవరి లెక్కలు వారివే అన్నట్లు పరిస్థితి కొనసాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నప్పటికీ ప్రముఖంగా నాలుగు స్థానాల్లో గెలుపోటములపైనే సర్వత్రా చర్చ సాగుతోంది. ఆయా స్థానాల్లో గెలుపోటములపై పందేల జోరు పెద్దఎత్తున నడుస్తోంది. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, చెరుకువాడ రంగనాథరాజు పోటీ పడుతున్నారు. 2019 ఎన్నికల్లో పితానిపై గెలిచిన రంగనాథరాజు మంత్రి పదవి సైతం దక్కించుకున్నారు. ఈసారి ఎన్నికల్లో మరోసారి ఇరువురు తలపడుతున్నారు. ఎన్నికల వ్యూహాల్లో ఇద్దరు నాయకులు ఆరితేరిన వారే. ఇద్దరూ ఆర్థిక, అంగబలం పుష్కలంగా ఉన్న నాయకులే. దీంతో ఎన్నికల పోరు నువ్వా నేనా అన్నట్లు సాగుతుందనే చర్చ నడుస్తోంది. ఆచంట నియోజకవర్గం పితానికి బలమైనదిగా చెప్పుకునేవారు. గత ఎన్నికల్లో ఆయన ఓటమి చవిచూడాల్సి వచ్చింది. దీంతో ఈసారి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ ఎన్నికలు వీరి రాజకీయ భవితవ్యంపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఇక్కడ గెలుపోటములపై జనం ఇప్పటి నుంచే పందేలు సైతం పెద్దఎత్తున వేస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఉండి నియోజకవర్గ రాజకీయం అనుక్షణం ఉత్కంఠ రేపుతూనే ఉంది. టిడిపి ముందుగా ప్రస్తుత ఎంఎల్ఎ మంతెన రామరాజుకు టిక్కెట్ ఇవ్వడం, తర్వాత కనుమూరి రఘురామకృష్ణంరాజుకు మార్పు చేయడం, ఈ మధ్యలో రామరాజు తిరుగుబాటుకు దిగి మళ్లీ శాంతించడం వంటి అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అదేసమయంలో టిడిపి రెబల్ అభ్యర్థిగా వేటుకూరి శివరామరాజు ఇండిపెండెంట్‌గా ఎన్నికల బరిలోకి దిగారు. అట్టహాసంగా నామినేషన్ సైతం వేశారు. వైసిపి నుంచి పివిఎల్.నరసింహరాజు ప్రచారం చేసుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. టిడిపి నుంచి రఘురామకృష్ణంరాజు, ఆ పార్టీ రెబల్ అభ్యర్థిగా శివరామరాజు పోటీలో ఉండటంతో ఉండిలో ఓటింగ్ సరళి ఎలా ఉంటుందోననే చర్చ సాగుతోంది. అంతేకాకుండా సిఎం జగన్‌ను తీవ్రంగా విమర్శిస్తూ కొన్నేళ్లుగా వార్తల్లో ప్రముఖంగా నిలుస్తున్న రఘురామకృష్ణంరాజు ఇక్కడ పోటీలో ఉండటం మరో చర్చకు దారితీసింది. ఉండి స్థానం టిడిపికి బలమైనదిగా పేరొందినప్పటికీ ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాలతో ఉండిలో ఎవరు గెలుస్తారోననే ఉత్కంఠ నెలకొంది. దీంతో ఉండిస్థానంపైనా పందేల హోరు జోరుగా సాగుతోంది. జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన నియోజకవర్గాల్లో భీమవరం ఒకటి. ఇక్కడ వైసిపి నుంచి గ్రంధి శ్రీనివాస్, జనసేన నుంచి మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు పోటీలో ఉన్నారు. గత ఎన్నికల్లో భీమవరంలో జనసేన నుంచి పవన్‌కల్యాణ్ పోటీ చేయగా వైసిపి నుంచి పోటీచేసిన గ్రంధి శ్రీనివాస్ గెలుపొందిన సంగతి తెలిసిందే. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈస్థానంలో ఈసారి జనసేన గెలుస్తుందా, లేక వైసిపినే మళ్లీ గెలుస్తుందా అనే చర్చ ఎక్కువగా సాగుతోంది. దీంతో ..6లో



భీమవరంలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కెబిఆర్ నాయుడు

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- రెండు జిల్లాల్లో ఎంపీ, ఎంఎల్ఎ స్థానాలకు 347 నామినేషన్లు
- 'పశ్చిమ'లో పార్లమెంట్‌కు 27, అసెంబ్లీకి 102 మంది
- ఏలూరు జిల్లాలో పార్లమెంట్‌కు 23, అసెంబ్లీకి 195 మంది
- 26, 27 తేదీల్లో నామినేషన్ల పరిశీలన
- 29న విత్‌డ్రాల పర్వం, అదేరోజు అభ్యర్థుల తుది జాబితా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

2024 సాధారణ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఆదివారం సెలవురోజు మినహాయించి ఏడురోజులపాటు సాగింది. రెండు జిల్లాల్లో రెండు ఎంపీ, 14 ఎంఎల్ఎ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ సాగింది. రెండు జిల్లాల్లో రెండు ఎంపీ స్థానాలకు 50 నామినేషన్లు దాఖలవ్వగా, 14 అసెంబ్లీ స్థానాలకు 297 మంది నామినేషన్లు దాఖలు చేయడంతో మొత్తం 347 నామినేషన్లు దాఖలైనట్లు తేలింది. ఏలూరు జిల్లాలో ఏలూరు పార్లమెంట్ స్థానానికి మొత్తం 23 మంది నామినేషన్లు వేశారు. ఏడు అసెంబ్లీ స్థానాలకు 195 మంది నామినేషన్లు దాఖలు చేశారు. 'పశ్చిమ'లోని నరసాపురం పార్లమెంట్ స్థానానికి మొత్తం 27 మంది నామినేషన్లు వేయగా, ఏడు అసెంబ్లీ స్థానాలకు 102 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్లకు ఆఖరి రోజు గురువారం పశ్చిమ గోదావరి జిల్లాలో నరసాపురం ఎంపీ స్థానానికి 12 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ఏడు అసెంబ్లీ స్థానాలకు 67 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఏలూరు జిల్లాలో ఆఖరిరోజు పార్లమెంట్‌కు ఎనిమిది నామినేషన్లు దాఖలవ్వగా అసెంబ్లీకి పెద్దఎత్తున నామినేషన్ల పర్వం సాగింది. నామినేషన్ల సందర్భంగా పెద్దఎత్తున ర్యాలీలు కొనసాగాయి. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఒకరికొకరు పోటీపడి మరీ ర్యాలీలు నిర్వహించారు. నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న జనానికి పెద్ద ఎత్తున భోజనాల ఏర్పాట్లు సాగాయి. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు గరిష్టంగా నాలుగు సెట్ల వరకూ నామినేషన్లు వేశారు. నామినేషన్ల పర్వం ముగియడంతో 26, 27 తేదీల్లో నామినేషన్ల పరిశీలన జరగనుంది. 28న ఆదివారం సెలవు. సోమవారం 29న విత్‌డ్రాల ప్రక్రియ జరగనుంది. అదేరోజు సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను అధికారులు ప్రకటించనున్నారు. అనంతరం మే 13న పోలింగ్ ప్రక్రియ జరగనుంది.

జిల్లా కేంద్రం.. సమస్యల సంద్రం

మధ్యపేజీల్లో..

డిపాజిట్ గల్లంతు అంటే..?

దోమలు సమాజానికి పెనుముప్పు

8లో..

నాడు పోరాటంలో లేనివారు దేశభక్తులా

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి - తణుకురూరల్

మన దేశ స్వాతంత్ర పోరాటాల్లో ఎటువంటి పాత్రా లేనటు వంటి వాళ్ల ఈ రోజు మన ముందుకొచ్చి దేశ భక్తులుగా చెప్పుకోవడం సిగ్గుచేటని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ విమర్శించారు. గురువారం స్థానిక స్త్రీ సమాజం రోడ్డులోని సజ్జాపురం లయన్స్‌క్లబ్‌లో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉభయగోదావరి జిల్లాల కార్యదర్శి కామన మునిస్వామి అధ్యక్షతన 'సంక్షోభంలో భారత్ ఆర్థిక, రాజకీయ మూలాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక మూలాలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో సరైన తీర్పు లేకపోతే భారతదేశంలో ఇక ఎప్పటికీ ఎన్నికలు ఉండబోవని, ప్రజలు అప్రమత్తతతో ఆలోచించి ఓటు వేయాలన్నారు. మణిపూర్ ఎక్కడో ఉందనుకుంటున్నారని, అక్కడ జరిగిన ఘటనలు రేపు మన ప్రాంతంలో ప్రత్యక్షమవుతాయన్నారు. ఒకపక్క పాలకులు మన దేశం మెరిసిపోతుందని, ప్రపంచంలో అతివేగంగా అభివృద్ధి చెందుతుందని, బ్రిటన్‌ను అధిగమించి ఐదో ఆర్థిక వ్యవస్థగా ఏర్పడిందని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. మరోపక్క 2047కి అభివృద్ధి చెందిన దేశంగా చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. మొదట్లో పెట్రోల్ రూ.110, గ్యాస్ ధర రూ.1145కు పెరిగినప్పుడు కంగారుపడ్డామని, తర్వాత మనం వాటి మాటే మర్చిపోయామన్నారు. కరోనా సమయంలో వలస కార్మికులు లక్షలాది మంది కాలినడకన నడిచి వెళ్తే ఆ బాధలు మనకు ఆగ్రహం తెచ్చాయని, రాత్రికి రాత్రి నోట్ల రద్దు చేశారంటే డబ్బు మార్చడం కోసం బ్యాంకుల వద్ద క్యూలో నిలబడి అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ఎన్నో రోజులు బాధపడ్డాంగానీ తర్వాత అవన్నీ మర్చిపోయామని గుర్తు చేశారు. ఎన్ని చేసినా ప్రజలు ఓట్లు వేస్తున్నారని, ఎదురు ప్రశ్నించే వారు లేరని పాలకులు ఒక నిర్ధారణకు వచ్చారన్నారు. గుజరాత్‌లో ఊచకోత జరిగినా మళ్లీ అధికారం దక్కిందని గుర్తు చేశారు. దేశంలో నిరుద్యోగం ఎన్నడూ లేనంతగా తీవ్రస్థాయిలో పెరిగిపోయిందన్నారు. విద్యావంతుల్లో నిరుద్యోగం 85 శాతంగా ..6లో

తణుకులో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

నేడు జిల్లాలో వైఎస్.షర్మిల ప్రచారం

ప్రజాశక్తి - చింతలపూడి

పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు చింతలపూడిలో రోడ్ షో నిర్వహిస్తారని చింతలపూడి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా తెలిపారు. అనంతరం దెందులూరు నియోజకవర్గంలోని గోపన్నపాలెంలో సాయంత్రం ఆరు గంటలకు సభలో పాల్గొని ప్రసంగించనున్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి

రాజ్యాంగంపై అవగాహన పెంచుకుని ప్రజలను చైతన్యపరిచే విధంగా కృషి చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు భాస్కరరావు కోరారు. మండలంలోని ఉనికిలో ఐక్యవేదిక మండల శాఖ ప్రధాన కార్యదర్శి కొరపాటి మర్కురాజు జ్యోతి వివాహ వేడుకల్లో గురువారం పాల్గొని రాజ్యాంగ పీఠిక ఫ్లెక్స్ బ్యానర్లను ప్రదర్శించి ఓటు హక్కుపై వధూవరులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పలు ఐక్యవేదిక ప్రచురణ పుస్తకాలను వధూవరులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు టి.అప్పారావు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శాంతరాజు, బుద్ధుల రాముడు పాల్గొన్నారు.

పశు వైద్య సిబ్బందికి యాంటీ ర్యాబిస్ టీకాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రాంతీయ పశువైద్య శాలలో పని చేస్తున్న పశువైద్య సిబ్బందికి యాంటీ రాబిస్ టీకాలు వేసినట్లు ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ మల్లంపల్లి సాయిబుచ్చారావు తెలిపారు. ఈ టీకాలను ఇండియన్ ఇమ్యునాలిజికల్స్, వర్ష ఫార్మా కంపెనీల ఆధ్వర్యంలో ఉచితంగా వేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వైద్యం అందించడంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వైద్యం అందించే పశు వైద్య సిబ్బందికి ఎటువంటి సంక్రమిత వ్యాధులు రాకుండా ఈ టీకాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వర్ష గ్రూప్ సిఇఓ డాక్టర్ రజినీకాంత్, పశు వైద్యులు, జె.లక్ష్మీప్రసన్న, శేఖర్ దొర, విద్యా, పశు వైద్య సిబ్బంది అమ్ములు, రాజు, కస్తూరి, భవాని, సత్యనారాయణ, అచ్యుతరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదానం ట్రస్ట్‌కు దాతలు రూ.పది లక్షల విరాళం అందించారు. కృష్ణా జిల్లా విజయవాడ కరెన్సీ నగర్ వాస్తవ్యులు కేతినేని రత్నాకరరావు, లక్ష్మీశమంతకమణి దంపతులు వారి తాత నందివాడ మండలం రామాపురం వాస్తవ్యులు నెక్కంటి ఆదినారాయణ, మాణిక్యమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.పది లక్షల విరాళాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాధారావుకు అందించారు. అనంతరం దాతల కుటుంబ సభ్యులు స్వామి వారు అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి దేవస్థానం వారు తీర్థ ప్రసాదాలు, అన్నదానం బాండ్ పేపర్స్ అందించారు.

పలు గ్రామాల్లో హరికుమార్‌రాజు ప్రచారం

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని పత్తేపురం, పెదనింద్రకొలను గ్రామాల్లో కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజు గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం నిత్యావసర ధరలను విపరీతంగా పెంచిందన్నారు. బిజెపిని ప్రత్యేక్షంగా, పరోక్షంగా మద్దతిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నారపల్లి రమణారావు, మేడిశెట్టి పెంటారావ్, లావేటి చంద్రావు, వెలగలేటి మోహన, శ్రీను, .కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

13వ వార్డులో వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని 13వ వార్డులో ఏలూరు రోడ్డు స్వరాజ్ ట్రాక్టర్ షోరూం దగ్గర నుంచి వైసిపి నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైసిపి ఏలూరు ఎంపీ కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌ను, చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ పిపిఎన్.చంద్రావు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తినసాగలక్ష్మి, పోలవరం ఎన్నికల పరిశీలకులు జెట్టి గురునాధరావు, గోకుల పారిజాతగిరి ఛైర్మన్ గు డపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నివారణ

ప్రజాశక్తి - చింతలపూడి

సమర్ధవంతమైన సమాజ భాగస్వామ్యంతో మలేరియా వ్యాధిని నివారించగలమని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.అనిల్‌కుమార్ అన్నారు. కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జాతీయ మలేరియా దినోత్సవం ప్రదర్శనను చింతలపూడిలో పట్టణ ఆరోగ్య కేంద్రం రాఘవాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో మలేరియా వ్యాధి పట్ల అవగాహన పెంపొందించి డెంగీ మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.ఎ.ప్రసాద్, హెచ్‌వి పరిమళ కుమారి, ఎం.బాలరాజు, కె.శ్రీనివాసరావు, ఎఎన్ఎం బి.విజయనిర్మల, ఎంఎల్ఎహెచ్‌పి దిలీప్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మనస్వికి కొలుసు పార్థసారధి అభినందన

ప్రజాశక్తి - ముసునూరు

మనస్విని అభినందిస్తున్న పార్థసారధి

పదో తరగతి ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ముసునూరు మండలానికి చెందిన విద్యార్థిని ఆకుల వెంకటనాగసాయి మనస్విని టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి అభినందించారు. పార్థసారధి మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన ఆకులవెంకటనాగ సాయి మానస్వి ఇంటికి వెళ్లి ఆమెతో పాటు ఆమె కుటుంబసభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు ప్రాంతానికి చెందిన విద్యార్థి వెంకట నాగ సాయి మనస్వి 599 మార్కులు సాధించి, రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించడం నూజివీడు ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థి కృషి, పట్టుదల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిపితే ఇంతటి గొప్ప విజయాన్ని సాధించగలగరన్నారు. విద్యార్థి ఉన్నత చదువులకు ఎటువంటి సహాయం కావాలన్నా, తాను అండగా ఉంటానని, మరింత ఉన్నత చదువులు చదివి నూజివీడు ప్రాంతానికి మరింత పేరు తీసుకురావాలన్నారు.

ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి వైసిపి కృషి

ఎంఎల్ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆళ్ల నాని

ముస్లిం, మైనారిటీలకు, వెనుకబడిన వర్గాలకు అండగా వైసిపి ప్రభుత్వం ఉందని, రానున్న ఎన్నికల్లో అందరూ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైసిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని కోరారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పలువురు ముస్లిం మైనార్టీ యువకులు టిడిపి నుంచి ఆళ్ల నాని సమక్షంలో వైసిపిలో చేరారు. 46వ డివిజన్‌కు చెందిన షేక్ నాగూర్ ఆధ్వర్యంలో, 47వ డివిజన్‌కు చెందిన జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ జలీల్ ఆధ్వర్యంలో వంద మంది ముస్లిం యువకులు వైసిపిలో చేరారు. వారికి ఆళ్ల నాని పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి, రక్షణకు వైసిపి ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రియాజ్, ఖాజా, అక్బర్, అమీను, సలీమ్, మొహిద్దీన్, ఇలియాస్, గంటా మహేష్, పండు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిదే విజయం

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి

మాట్లాడుతున్న టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమి విజయకేతనం ఎగురవేయనుందని ఆ పార్టీ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి ధీమా వ్యక్తం చేశారు. కూటమి గెలుపులో భాగస్వాములయ్యేందుకు ప్రతిఒక్కరూ సమిష్టిగా ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఏలూరు ఐదో డివిజన్ ఇన్‌ఛార్జి దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ చింతా దుర్గారెడ్డి ఆధ్వర్యంలో చింతా మహేష్, జగ్గి శ్రీనివాస్, కప్పా శ్రీనివాసరావుతో పాటు సుమారు 50 మంది టిడిపిలో చేరారు. పార్టీలో చేరినవారికి బడేటి చంటి టిడిపి కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. అనంతరం బడేటి మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఎ, కీర్తిశేషులు బడేటి బుజ్జి రుణం తీర్చుకునేందుకు సరైన తరుణం కోసం వేచి చూస్తున్న చాలామంది నిస్వార్థంగా తన వెంట నడిచేందుకు ముందుకొస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర నాయకులు దాసరి ఆంజనేయులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి అమరావతి అశోక్, టిడిపి నాయకులు పరసా ప్రసాద్, కంపా విటల్, రెడ్డి ఈశ్వరరావు, గంగాధరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

మండవల్లి:అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో క్రమశిక్షణ కలిగిన విద్య అలవాటు అవుతుందని సిడిపిఒ లావణ్య అన్నారు. మండలంలోని ఉనికిని పెనుమాకలంక గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులు మంచి అలవాట్లు నేర్చుకోవడం అంగన్వాడీలోనే ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి ప్రసన్న, అంగన్వాడీ కార్యకర్తలు రజిని, శాంతి, రమాదేవి, కుమారి పాల్గొన్నారు.

చింతలపూడి ఎలిజా ప్రచారం

ప్రజాశక్తి - చింతలపూడి

దేశంలో ఇండియా వేదిక అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని, చింతలపూడి నియోజకవర్గంలో తనను గెలిపించాలని కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా కోరారు. చింతలపూడిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఆయన గురువారం రోడ్ షో ప్రారంభించి పాత బస్టాండ్ నుంచి గంటా వారి వీధి బట్టువారిగూడెం, సుప్రీంపేట, వెంకట్రామా బాగ్ మీదుగా ఫైర్ స్టేషన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా వేదికతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో తనను గెలిపించాలని కోరారు.ఇంటింటి ప్రచారంతో కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు నోబుల్

పోల్‌రాజు కెనాల్‌కు నీటి సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని పోల్‌రాజు కెనాల్‌కు తాగునీటి సరఫరాను అధికారులు నిలిపివేశారు. మండలంలో ఈ కెనాల్ పరిధిలో 14 తాగునీటి చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో తాగునీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో నీటితో నింపివేశారు. ఈ నెల 12వ తేదీన తాగునీటి అవసరాల కోసం నియోజవర్గంలో మంచినీటి చెరువులను నింపుకునేందుకుగాను అధికారులు కాలువకు నీటిని విడుదల చేశారు. కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నిండుకోవడంతో నీటి సరఫరాను ఈ కాలువకు నిలుపుదల చేశారు.

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతివ్వండి

డిఎన్ఆర్ కోడలు స్వాతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్న సంక్షేమ ప్రభుత్వానికి మరో మారు మద్దతునివ్వాలని కైకలూరు ఎంఎల్ఎ డిఎన్ఆర్ కోడలు దూలం స్వాతి అన్నారు. మండలంలోని పేరూరులో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, దాకారం సొసైటీ చైర్‌పర్సన్ సోమ సత్యనారాయణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో నోబుల్ ప్రచారం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని వెంకటాపురం, ఇందిరాకాలని, బరింకలగరువు, గొల్లగూడం గ్రామాల్లో కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

'రోషన్‌కుమార్ నామినేషన్ రద్దు చేయాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ నామినేషన్ రద్దు చేయాలని జీలకర్రగూడేనికి చెందిన విశ్రాంత మండల విద్యాశాఖాధికారి సేవా ధర్మదాస్ డిమాండ్ చేశారు. స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఒక ప్రయివేట్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి అయిన రోషన్‌కుమార్ ఈ నెల 22వ తేదీన దాఖలు చేసిన నామినేషన్ పత్రం, అఫిడవిట్‌లోఅన్ని పేర్కొనలేదన్నారు. ఆయన నామినేషన్ రద్దు చేయాలన్నారు.

'టిడిపి కూటమితోనే అభివృద్ధి'

చింతలపూడి :టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు హామీ ఇచ్చారు. టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌ను, చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్‌లను గెలిపించాలని గురువారం వారు ప్రచారం ప్రచారం చేశారు. వీధి దీపాలు వెలగడంలేదని, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు ఇళ్లలోకి వచ్చేసుందని, దోమలతో, దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వారి సమస్యలను తెలిపారు.

పలు గ్రామాల్లో కంభం విజయరాజు ప్రచారం

ప్రజాశక్తి - కామవరపుకోట

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. మండలంలో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తడికలపూడి గ్రామపంచాయతీ రత్నగిరి నగర్‌లో రత్నా తులసి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాగిపాడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రత్నగిరి నగర్, సాగిపాడు, వీరంపాలెం, కళ్లచెరువు, పోలాసి గూడెం, కెఎస్.రామవరం, గుంటుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో పలువురు మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారంలోకొచ్చిన వెంటనే పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు, ఎంపిపి మేడవరపు విజయలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కడిమి రమేష్, చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, నూజివీడు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరుముచ్చు గోపాల్, సర్పంచి గుండుగోలు సుబ్బారావు, ఎంపిటిసి సభ్యులు బూరుగు శ్రీను పాల్గొన్నారు.

'రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలి'

ప్రజాశక్తి -పెనుమంట్ర

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని ఆ పార్టీ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాధరాజు కోరారు. మండలంలోని మార్టేరులో ఆయన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డితో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరంగనాధరాజు మాట్లాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైసిపి ప్రభుత్వం రావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు :మండలంలో 33 కెవి వంగాయగూడెం ఏలూరు ఫీడర్ చెట్ల నరికివేత, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. పవర్ పేట సెక్షన్ 33/11 కెవి, ఏలూరు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి, వెంకన్న ట్యాంక్ 11 కెవి, పవర్‌పేట, 11 కెవి రామకృష్ణపురం, 11 కెవి పోణంగి, 11 కెవి గ్రీన్‌సిటీ ఫీడర్స్ పరిధిలోని పడమర వీధి, పాత బస్టాండ్, వసంత మహల్, రామకృష్ణాపురం, గ్రీన్ సిటీ, హనుమాన్ నగర్, గొల్లయగూడెం, గులాబితోట, నెహ్రూ కాలనీ, కొబ్బరి తోట, వంగాయ గూడెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

టిడిపి కూటమితోనే అభివృద్ధి

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు



ప్రచారంలో రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

టిడిపి కూటమితోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. ఆయన గొల్లలకోడేరులో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గొల్లలకోడేరు నుంచి ప్రారంభమైన ఈ ఎన్నికల ప్రచారం గరగపర్రు, మైప గ్రామాల వరకు సాగింది. రఘురామకృష్ణంరాజు ప్రజలను ఓట్లు అభ్యర్థించి తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి ముఖ్య నేత గాదిరాజు వెంకటసూర్యనారాయణరాజు, నాయకులు దెందుకూరి కోటిరాజు, కామన రాంబాబు, కమ్మిలి రాంబాబు, గాదం నానాజీ, సత్యకృష్ణ, వీరవల్లి వెంకటలక్ష్మి రమణ, పాల వెంకట చలపతి, గాదిరాజు శ్రీనివాస్‌రాజు, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజు సతీమణి, కుమార్తె ప్రచారం

ఉండి : సార్వత్రిక ఎన్నికల్లో కనుమూరి రఘురామకృష్ణంరాజు విజయానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన సతీమణి రమాదేవి, కుమార్తె ఇందిరా ప్రియదర్శిని ఓటర్లను కోరారు. ఉండి గ్రామంలో టిడిపి మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో వారు గురువారం ఎన్నికల ప్రచారం చేశారు.

మాముడూరులో పితాని కోడలు ప్రచారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ విజయాన్ని ఆకాంక్షిస్తూ మండలంలోని మాముడూరులో గురువారం వారి కోడలు పితాని నాగ సాహితి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో సైకిల్‌పై ఓటు వేసి పితాని సత్యనారాయణను గెలిపించాలని కోరారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా

ప్రచారంలో పితాని సత్యనారాయణ కోడలు సాహితి

ఉపాధ్యక్షురాలు మాధవి లత, బిజెపి మహిళా మోర్చా నాయకురాలు, జనసేన వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ప్రచారంలో చెరుకువాడ శ్రీరంగనాధరాజు

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాధరాజు

ప్రజాశక్తి - ఆచంట

రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందని, ప్రజలను ఓట్లు అడిగే హక్కు వైసిపికే ఉందని ఆ పార్టీ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాధరాజు అన్నారు. పెనుమంట్ర మండలంలోని మార్టేరు గ్రామంలో ఆయన గురువారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు చేసిన మేలును గుర్తించి వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్‌కు మద్దతుగా నిలవాలన్నారు. మళ్లీ ఇటువంటి పాలన కావాలంటే జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైసిపి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపిపి కర్రి వాసిరెడ్డి, సర్పంచి మట్టా కుమారి పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

కలిదిండి : మండలంలోని కొండంగి, మట్టగుంట గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు టిడిపిలో చేరినట్లు టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు తెలిపారు. కొండంగికి చెందిన ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు తిరుమలశెట్టి కమలదాస్, నరసింహస్వామి, మట్టగుంటకు చెందిన ఎంపిటిసి ఒడుగు గణపతి, వార్డు సభ్యులు తిరుమాని ఏడుకొండలు, పెదశింగు చంద్రరాజు, కొల్లాటి గోకర్ణేశ్వరరావుతో పాటు వంద మంది టిడిపి చేరారని చెప్పారు.

పెన్షనర్లకు న్యాయం చేస్తాం : అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమి విజయం తథ్యమని, విజయం సాధించిన వెంటనే పెన్షనర్ల సమస్యను పరిష్కరించి వారికి న్యాయం చేస్తామని జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఉమ్మడి పార్టీ శిబిరంలో అంజిబాబును ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ అసోసియేషన్ అమరావతి, ఆంధ్రప్రదేశ్ పున:నిర్మాణ పెన్షనర్స్ సంక్షేమ సంఘ సభ్యులు గురువారం కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీకి తమ మద్దతు ఇస్తున్నట్లు సంఘ అధ్యక్షులు పి.గురవయ్య, జి.పూర్ణచంద్రరావు, మాజీ కార్యదర్శి చౌదరి తెలిపారు. జగన్ పాలనలో పెన్షనర్లకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పి.నాగరాజు, ఆచంట రామరాయుడు, డి.క్రిస్టోఫర్, ఆర్.రామ్మూర్తి నాయుడు, వి.కృష్ణమనాయుడు, పి.పిచ్చయ్య, సిహెచ్.సుభాష్‌చంద్రబోస్, సిహెచ్.శ్రీనివాసరావు, టి.వెంకటనరసయ్య, వై.దానయ్య, పి.పద్మనాభం, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంజిబాబు

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచి** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కాజు మంగమ్మ,** భర్త : కాజు దేవానందం, వయస్సు : 37 సం॥, నివాసం : గనిజర్ల గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్‌డి లో చేరిన చింతలపూడి మండలం గనిజర్ల గ్రామ పంచాయితీ గనిజర్ల రెవిన్యూ గ్రామం తాలూకు ఆర్.యస్.నెం. 27-1రు, దాఖలా గనిజర్ల గ్రామంలోయున్న డోర్ నెం. 2-172రు గల యింటికి సమీపన నాకుగల నీకు దఖలు పర్చిన చ॥గ॥ 290.4లుకు చ॥మీ॥ 241-03 ర్లు, **డాక్యుమెంట్ నెం. 1266/2024** గల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : రోడ్డు, **దక్షిణము** : కాజు సత్యానందం గార ఇల్లు, **పడమర** : కాజు చంద్రం గారి ఖాళీ స్థలం, **ఉత్తరం** : కాజు దేవానందం గారి ఖాళీ స్థలం.

పలివెల గణేష్‌బాబు
అడ్వకేట్, కొత్తగూడెం, **9849246278**

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, విస్సాకోడేరు గ్రామం, డో.నెం. 8-234 కు చెందిన కాగిత చిన్న దుర్గారావు, S/o. వెంకటేశ్వరరావు అను నా యొక్క ఒరిజినల్ దస్తావేజులు 13-4-2024వ తేదీన నా గ్రామము అయిన విస్సాకోడేరు నుండి భీమవరం M.R.O. ఆఫీసు సెంటర్‌కు జిరాక్స్ తీయించు నిమిత్తం మోటారు సైకిల్‌పై వెళ్ళుచుండగా దారి మధ్యలో ఒరిజినల్ దస్తావేజులు పడిపోయినవి. ఒరిజినల్ దస్తావేజు నెంబర్ 1063/2018. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కాగిత చిన్న దుర్గారావు
S/o. కాగిత వెంకటేశ్వరరావు
డోర్ నెం. 8-234, విస్సాకోడేరు గ్రామం
పాలకోడేరు మండలం, ప॥గో॥జిల్లా, ఎ.పి.,

ప్రకటన

మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 361/2014

Between:

వాది: సత్తి షర్మిలా రాణి, మైనర్ గార్డియన్, తల్లి పుష్పావతి అనే పుష్పాలలిత

మరియు

ప్రతివాదులు: సత్తి శ్రీనివాసరెడ్డి, వగైరా

11వ ప్రతివాది: ద్వారంపూడి వెంకటలక్ష్మి, W/o. శ్రీనివాసు రెడ్డి, డో.నెం. 2-38, పాలి, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534255.

పై నెంబరు దావా గ్రంధము నందు శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము సత్తి శివ చంద్రశేఖర్‌రెడ్డి, S/o. బ్రహ్మారెడ్డి (10వ ప్రతివాది) తరుపున మీకు ఎన్నిసార్లు దావాలో సమన్లు పంపించిననూ అమలు జరగని కారణముగా Substitute of Service ద్వారా సమన్లు అమలు నిమిత్తము **ది. 10-05-2024 సం॥రం తేదీనకు వాయిదా వేసినారు. ఆరోజు ఉదయము గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By Order//

కొండూరి అనంద పద్మనాభం
ఇందుకూరి వెంకట నరసింహరాజు
వాది తరపు న్యాయవాదులు, తణుకు

ది. 25-04-2024 సెల్: 948193227

రోషన్‌కుమార్‌ను గెలిపించాలని టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్‌ను గెలిపించాలని టిడిపి పట్టణ నాయకులు, మండల కో-ఆర్డినేటర్ చెరుకూరి శ్రీధర్, మండల ప్రెసిడెంట్ సాయల సత్యనారాయణ, తూటికుంట రాము, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పట్టణంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రెసిడెంట్ సాయల సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి హయాంలో ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. జంగారెడ్డిగూడెంలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలు వాస్తవాలను గ్రహించి టిడిపి కూటమిని గెలిపించాలన్నారు. టిడిపి కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారంలో టిడిపి నేతలు

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నం.12(1744533)/2019/డి.బి **తేది.24-04-2024**

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో **షార్టు టెండరు నోటీసు నెం. 1(1-4)/ BHI/జనరల్/2024-25/E2** లోని జనరల్ ఫండ్స్ నుండి 4 పనులకు సంబంధించి రూ. 18.13 లక్షలకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్. నెం. 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం జిరిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్టు, www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘం, ప॥గో॥జిల్లా (సెల్: 9849906540, 9849906543) వారిని సంప్రదించగలరు.

సం/- **కమిషనరు**
భీమవరం పురపాలక సంఘం

ఇండియా వేదికకు పట్టం కట్టాలి

మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కేంద్రంలో మోడీ అరాచకపాలన పోవాలంటే దేశంలో ఇండియా వేదికకు ప్రజలు పట్టం కట్టాలని మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. కాంగ్రెస్ నర్సాపురం పార్లమెంటు అభ్యర్థిగా కొర్లపాటి బ్రహ్మానందరావు నాయుడు (కెబిఆర్) నామినేషన్ సందర్భంగా గురువారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మోడీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని, దీంతో ఇండియా వేదికకు పట్టంకట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, పోలవరం ప్రాజెక్టు వంటి ఎన్నో హామీలు ఇచ్చిన మోడీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సమస్యల్లోకి నెట్టిందన్నారు. రాజకీయ లబ్ధికోసం టిడిపి, జనసేన ఎన్‌డిఎ కూటమికి మద్దతు ప్రకటించాయని, గత ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలిపిస్తే మోడీ మెడలు వంచుతానన్న జగన్ మోడీ కాళ్లకు మొక్కుతున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో ఈ మూడు పార్టీలకూ ప్రజలు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ పార్టీ అయిన బిజెపి దేశంలో మతకల్లోలాలు సృష్టిస్తూ లౌకికవాదాన్ని నాశనం చేస్తోందన్నారు. ఎంపీ అభ్యర్థి బ్రహ్మానందం నాయుడు మాట్లాడుతూ రాహుల్ గాంధీ జోడాయాత్రలో 4000 కిలోమీటర్లు పూర్తి చేశారని, దీంతో ప్రజల సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాత అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మంచి మేనిఫెస్టోను తీసుకొచ్చారని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ఏటా మహిళకు లక్ష రూపాయలు అందిస్తామన్నారు. దేశంలో మహిళలపై, దళితులపై, మైనార్టీ ముస్లింపైన దాడులు పెరిగిపోయాయని, కాంగ్రెస్‌తోనే వారికి న్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ అభ్యర్థి అంకెం సీతారామ్, సిపిఎం జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సిపిఎం పట్టణ నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, గూడూరి త్రిమూర్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి


ప్రచారం చేస్తున్న హరికుమార్ రాజు, నేతలు

ప్రజాశక్తి - గణపవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని, మతతత్వ బిజెపిని ఓడించి దేశ సమగ్రతను కాపాడాలని కోరుతూ గురువారం ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్ రాజు, సిపిఎం నాయకులు మండలంలోని అర్ధవరం, జల్లి కొమ్మర, నిడమర్రు మండలంలో భువనపల్లి, అడవికొలను గ్రామాల్లో ఎన్నికల నిర్వహించారు ఈ సందర్భంగా ఇండియా వేదిక నాయకులు మాట్లాడుతూ ఇండియా వేదికతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. మతతత్వ బిజెపిని దాన్ని బలపర్చే పార్టీలను ప్రజలు ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేడిశెట్టి పెంటారావు, గవర సత్యనారాయణ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పోలవరం అభ్యర్థి సృజన నామినేషన్

నామినేషన్ వేస్తున్న సృజన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి దువ్వెల సృజన గెలుపుతోనే పోలవరం ప్రాజెక్టు పూర్తయి, నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని పోలవరం ఇండియా వేదిక నాయకులు అన్నారు. గురువారం కాంగ్రెస్ అభ్యర్థిగా దువ్వెల సృజన నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సృజన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది 2005లో అని అప్పటి కాంగ్రెస్ వామపక్షాల కూటమితోనే సాధ్యమైందని తెలిపారు. మరలా అది పూర్తి కావాలంటే ఇప్పుడు అదే కూటమి అభ్యర్థిగా తనను నియోజకవర్గ ప్రజలు గెలిపించాలని కోరారు. తన గెలుపుతోనే పోలవరం ప్రాజెక్టు పూర్తయి నిర్వాసితులకు న్యాయం జరుగుతుందన్నారు. పోలవరంలో తాను గెలవడం ఖాయమన్నారు. వైసిపి, టిడిపి పాలనలో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్, వామపక్షాల ఉమ్మడి ప్రభుత్వాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. సిపిఎం పోలవరం నియోజకవర్గ ఎన్నికల కన్వీనర్ తెల్లం దుర్గారావు మాట్లాడుతూ ఇండియా వేదిక అభ్యర్థులు గెలుపు దేశానికి అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ సృజనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎంకు సంబంధించి ఏడు మండలాల కార్యదర్శులు, అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆచంట అభ్యర్థి వెంకట సత్యనారాయణ నామినేషన్

నామినేషన్ వేసేందుకు వెళ్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి నెక్కంటి వెంకట సత్యనారాయణ (సతీష్) అన్నారు. గురువారం ఆయన ఆచంటలో కాంగ్రెస్ కార్యాలయం నుంచి కచేరీసెంటర్, తహశీల్దార్ కార్యాలయం వరకూ కాంగ్రెస్, సిపిఎం నేతలు, కార్యకర్తలతో పాదయాత్రగా వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ మతతత్వ బిజెపిని దాన్ని బలపరుస్తున్న పార్టీలను ఓడించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, వీధి దీపాలు, డ్రెయినేజీ, తాగునీరు తదితర సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, కాంగ్రెస్ వల్లే అది సాధ్యపడుతుందని, ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నెక్కంటి సత్యనారాయణ (బంగారం), నెక్కంటి వెంకటేశ్వరరావు, కానుమిల్లి జోగిరాజు, సజ్జ రామారావు, గొడవర్తి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు, సూర్నీడి వెంకటేశ్వరరావు, కూసం పూడి సుబ్బరాజు, కేతా పద్మజ, కేతా ప్రమోద్, ఎస్‌విఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు, కుసుమే జయరాజు, మచ్చ సుబ్బారావు, టి.సత్యనారాయణ, విఘ్నేశ్వరుడు, దేవాబత్తుల రాధాకృష్ణ, రొక్కాల దేవదానం, నెక్కంటి వీరబ్రహ్మం పాల్గొన్నారు.

బాలరాజు నామినేషన్‌కు తరలిన జనం

ప్రజాశక్తి - కుక్కునూరు

జనసేన పోలవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి చిర్రి బాలరాజు నామినేషన్ సందర్భంగా కుక్కునూరు మండలం నుంచి టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ రావడంతో అటు టిడిపి నుండి ఇటు జనసేన నుంచి పెద్ద ఎత్తున కార్లలో తరలివెళ్లాఉ. ముందుగా టిడిపి మండల అధ్యక్షులు మొలిశెట్టి నాగు మాట్లాడారు. వైసిపి అరాచక పాలన అంతమొందించాలంటే తప్పనిసరిగా బాలరాజును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం.. సమస్యల సంద్రం..

వర్షపు నీటి మునిగిన రోడ్లు (ఫైల్‌ఫోటో)

ఎన్నికలు వస్తున్నాయి.. వెళ్లిపోతున్నాయి.. నేతలు ఎన్నికవుతున్నారు.. మరికొందరు మంత్రులుగా పని చేస్తున్నారు.. అయితే ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉన్నాయి. 1951లో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడగా ఇప్పటి వరకూ 14 సార్లు ఎన్నికలు జరిగాయి. సిపిఐతోపాటు కాంగ్రెస్, టిడిపి, వైసిపి తరపున నేతలు ఎంఎల్‌ఎలుగా ఎన్నికయ్యారు. కొందరు మంత్రులుగా పనిచేశారు. అయితే నియోజకవర్గ ప్రజల సమస్యలు తీర్చడంలో మాత్రం నేతలు విఫలమయ్యారు.

అసౌకర్యాల నీడలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం

నేతలెందరున్నా మారని ప్రజల రాతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇక సమస్యల విషయానికొస్తే ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఏలూరు నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న ఏడు గ్రామ పంచాయతీలు ఉండేవి. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాల్టీగా ఉన్న ఏలూరు నగరాన్ని 2005లో నగరపాలక సంస్థగా మార్పు చేశారు. అనంతరం 2020లో ప్రస్తుత ప్రభుత్వంలో ఏలూరు చుట్టుపక్కలున్న సత్రంపాడు, తంగెళ్లమూడి, కొమడవోలు, చొదిమెళ్ల, శనివారపుపేట, పోణంగి, వెంకటాపురం పంచాయతీలను నగరంలో విలీనం చేశారు. అయితే విలీనం చేసిన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టకపోగా పన్నుల భారం పెరిగి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

విలీన గ్రామాల్లో సౌకర్యాలు నిల్

విలీన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. స్వచ్ఛమైన తాగునీరు లేక ఆయా గ్రామాల ప్రజలు రోజూ డబ్బు చెల్లించి టిన్నులు కొనుక్కోవాల్సి వస్తోంది. పోణంగి, కొత్తూరు, వెంకటాపురం గ్రామాలకు గోదావరి జలాలు ఇస్తామని కార్పొరేషన్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన నాయకులు ఆ మాటే మారిచారు. వెంకటాపురం పంచాయతీలో సుద్ధ నీరు రావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

విలీన గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చూపకపోవడంతో ప్రజలు నానావస్థలు పడుతున్నారు. ఏడు విలీన గ్రామాల్లో మొత్తం పదివేల జాబ్ కార్డులు ఉండగా నెలకు రూ.5 వేలు చొప్పున వంద రోజులకు సుమారు రూ.15 వేల ఆదాయాన్ని ఆయా గ్రామాల ప్రజలు నష్టపోయారు. వారికి ఉపాధి హామీ పనులు కల్పించాలని అనేకసార్లు ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోలేదు.

సమస్యలు తిష్ట

ఇకపోతే నియోజకవర్గంలో ఎక్కువ భాగంగా ఉన్న ఏలూరు నగరంలో అనేక సమస్యలు ఏళ్ల తరబడి తిష్ట వేశాయి. ముఖ్యంగా నగరంలోని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో ఇటు పాలకులు, అటు అధికారులు విఫలమయ్యారు. ఇరుకైన రోడ్లు, అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థతోపాటు రోడ్లపై ఆక్రమణలు ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అనేకమంది వ్యాపారాలు చేస్తున్నా ఇటు అధికారులుగాని, అటు ట్రాఫిక్ పోలీసులుగాని స్పందించని పరిస్థితి. అలాగే ఇరుకైన రోడ్లు నగరంలో ఎక్కడ చూసినా కనిపిస్తాయి. ముఖ్యంగా బయట ఊరి నుంచి ఏలూరు నగరంలోకి ప్రవేశించే కత్తెపు వీధి, తంగెళ్లమూడి ప్రాంతాల్లో కనీసం బస్సులు కూడా తిరగలేని పరిస్థితిలో రోడ్లు ఇరుకుగా ఉండటంతో నిత్యం అక్కడ ట్రాఫిక్ జామ్ కావడం పరిపాటిగా మారింది. కొద్దిపాటి వర్షం వస్తే నగరంలోని రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రైతుబజార్లు మొత్తం జలమయం కావడంతో నగర ప్రజలు ప్రతి వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు.

వర్షం వస్తే ముంపే..

ఇకపోతే ఏలూరు నగరానికి వరద ముంపు సర్వసాధారణం అయిపోయింది. దీనికి కారణం ఇబ్బడిముబ్బడిగా తమ్మిలేరును ఆక్రమించడమే అని నిపుణులు చెబుతున్నారు. నగరంలో వంద మీటర్లు వెడల్పు ఉండే తమ్మిలేరు ఆక్రమణలకు గురై నేడు 60 మీటర్లకు తగ్గిపోయింది. తమ్మిలేరును ఆక్రమించిన వారికి వేరేచోట ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి తమ్మిలేరును వెడల్పు చేసి పూర్వస్థితికి తీసుకురావాల్సి ఉండగా ఓట్ల కోసం పాలకులు ఆక్రమించిన వారికే పట్టాలిచ్చి రిటైనింగ్ వాల్ నిర్మించడంతో తమ్మిలేరు వెడల్పు తగ్గిపోయింది. దీంతో నీరు పారే విధానం లేక తమ్మిలేరు పొంగినప్పుడల్లా ఏలూరు నగరానికి వరదలు ముంచెత్తుతున్నాయి. వరదలు వచ్చిన ప్రతిసారీ తంగెళ్లమూడి ప్రాంతంలో తమ్మిలేరుకు గండి కొట్టడం దాంతో ఆ చుట్టుపక్కల ఉన్న ఎస్‌ఎంఆర్ నగర్, సపోటా తోట తదితర ప్రాంతాలు జలమ యమవుతున్నాయి.

అసంపూర్తిగా టిడ్కో ఇళ్లు (ఫైల్‌ఫోటో)

రోడ్డున పడ్డ జ్యూట్‌మిల్లు కార్మికులు

నగరంలో వంద సంవత్సరాలు పైబడి ఉన్న జ్యూట్‌మిల్లు తప్ప మరో ఇండస్ట్రీ లేకపోవడంతో ఉపాధి కోసం ప్రజలు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. అయితే 2022లో ఏలూరు జ్యూట్‌మిల్లు మూతపడటంతో సుమారు ఐదు వేల మంది కార్మికులు, కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తాజాగా కొత్తూరు జ్యూట్‌మిల్లు సైతం మూతపడటంతో సుమారు మూడు వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. కార్మిక సంఘాల నాయకులు ఎంత పోరాడినా మిల్లు తెరవకపోవడంతో ఉపాధి కోసం కార్మికులు పెయింటర్లుగాను, తోపుడు బండ్లపై కూరగాయలు అమ్ముకుంటూ, కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. మొత్తం మీద ఏలూరు అసెంబ్లీలో ప్రధాన ప్రాంతమైన నగరంలో ఏళ్ల తరబడి ఉన్న ఒకే ఒక్క పరిశ్రమ మూతపడటంతో ఉన్న ఉపాధి కాస్త పోయింది. నగరపాలక సంస్థకు చెందిన సుబ్బమ్మ దేవి స్కూల్ గ్రౌండ్‌ను అప్పట్లో అధికారంలో ఉన్న నేతల సహకారంతో కొంతమంది ఆక్రమించగా నేటికీ దాన్ని తిరిగి పాఠశాలకు అప్పగించలేకపోయారు. అలాగే పోణంగి, కొత్తూరులో గత ప్రభుత్వం నిర్మించిన సుమారు 6 వేల టిడ్కో ఇళ్లు నేటికీ ప్రజలకు ఈ ప్రభుత్వం అందించలేదు. పూర్తయిన ఇళ్ల వద్ద పిచ్చి మొక్కలు మొలిచి నిరుపయోగంగా మారాయి.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏదీ?

ఇక నగరంలో చూస్తే టూటౌన్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తామని చెప్పిన నేతలు ఇంతవరకూ దాన్ని ఆచరణలో పెట్టలేదు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం సంగతెలా ఉన్నా ఉన్న డ్రెయినేజీలు సైతం మురుగునీరు పారక దుర్గంధం వెదజల్లుతూ వర్షాకాలం వస్తే ప్రజలు వ్యాధులు బారిన పడుతున్నారు. మరోపక్క కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలో నిత్యం నీరు వస్తూ ఉండడంతో ఆ నీటిని తోడేందుకు ఉద్యోగులను, మోటార్ పంపులను ఏర్పాటు చేసి నెలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు తప్ప దానికి శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులేవీ..

ఏలూరులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కనీస వసతులు లేకపోగా డిగ్రీ కాలేజీకి కనీసం సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటు అని పలువురు విమర్శిస్తున్నారు. నగరంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సొంత భవనాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. విద్యార్థి సంఘాలు అనేక పోరాటాలు, ఆందోళనలు చేసినా, వినతిపత్రాలిచ్చినా సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. దీంతో ఒక్కోసారి చెట్ల కిందే పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ కార్పొరేషన్‌లోని 12 పంపుల పాఠశాలను ఇంటర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం నేటికీ నెరవేరలేదు. దీంతో మున్సిపల్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకుని బయటకొచ్చిన పేద విద్యార్థులు లక్షల రూపాయలు వెచ్చించి ప్రయివేటు కాలేజీలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇక వైద్య రంగంలో చూస్తే మొన్నటి వరకూ జిల్లా ఆసుపత్రిగా ఉన్న ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీగా మారడంతో ఉన్న వైద్యులు కాస్త బదిలీపై వెళ్లిపోవడంతో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు 1200 నుంచి 1800 ఉండే ఔట్ పేషెంట్ల సంఖ్య నేడు 600లోపే ఉంటోంది. మెడికల్ కాలేజీగా మార్పు చెందినా కార్డియాలజీ, న్యూరాలజీ వంటి ప్రత్యేక సేవలు లేకపోవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిపై ఆధారపడిన ఏలూరు చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. .వన్‌టౌన్‌లోని కూరగాయలు, చేపల మార్కెట్‌ను ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులో తేవాల్సిన అవసరం ఉన్నప్పటికీ పాలకులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో ఆ రెండు మార్కెట్లూ అధ్వాన స్థితిలో ఉన్నాయి.

నగర ప్రజలకు దాహార్తిని తీర్చే పంపుల చెరువులో ఎప్పుడో బ్రిటీష్ వాళ్ల కాలంలో ఏర్పాటు చేసిన ఫిల్టర్‌బెడ్‌లు తప్పితే వాటిని ఆధునికీకరించిన పరిస్థితి లేదు. అలాగే నియోజకవర్గంలో విద్యుత్ శ్మశానవాటిక ఏర్పాటు దిశగా పాలకులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పోణంగి డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ యార్డు కొద్ది నెలల్లోనే మూతపడడంతో ప్రజా ధనం వృథా అయ్యింది. నగరంలోని గజ్జల వారి చెరువు, వెంకన్న చెరువు, పత్తేబాద చెరువు వంటివి చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి.

ఈ రకంగా ఏలూరు నియోజకవర్గంలో అనేక సమస్యలు ఏళ్ల తరబడి ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారు. ఇప్పటికి 14 సార్లు ఎన్నికలు జరిగినా, పాలకులు మారినా నగర ప్రజల ఇబ్బందుల్లో ఏమాత్రమూ మార్పు లేదని చెప్పొచ్చు. మే 13వ తేదీన మరోసారి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రానున్న పాలకులైనా ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

పగలు ప్రచారాలు.. రాత్రుళ్లు మంతనాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాజకీయ పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా వారి వారి అజెండాలతో పగలంతా ఇంటింటా ప్రచారాల్లో నేతలు తలమునకలై ఉంటున్నారు. రాత్రి అయ్యేసరికి తమ తమ వ్యూహ - ప్రతి వ్యూహాలకు పదును పెట్టే పనిలో బిజీగా ఉంటున్నారు. నామినేషన్ల పర్వం పూర్తయ్యింది. ఈ క్రమంలో ఉంగుటూరు అసంబ్లీ సీటు కోసం అధికార పక్షంతో పాటు కూటమి అభ్యర్థులు తమ బలాలు, బలహీనతలను బేరీజు వేసుకుంటున్నారు. పలానా గ్రామంలో ఓ నాయకుడో, నేతనో వారి పార్టీలోకి ఆహ్వానించిన వెంటనే రెండో పార్టీ వారు ఎంటర్ అయి తమకు మద్దతు కోరుతున్నారు. గెలుపు కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎవరికి వారు వ్యూహ రచనలు చేస్తున్నారు.

డిపాజిట్ గల్లంతు అంటే..?

ఎన్నికల నియమావళి ప్రకారం ప్రతి అభ్యర్థీ నగదు డిపాజిట్‌గా చెల్లించాలి. పార్లమెంట్ నియోజవర్గ అభ్యర్థి రూ.25 వేలు, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి రూ.10 వేలు చెల్లించాలి. అయితే రిజర్వుడు స్థానాల్లో అభ్యర్థులు పైన పేర్కొన్న దానిలో సగం చెల్లిస్తే సరిపోతుంది. ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఆరు శాతం ఓట్లు అభ్యర్థి సాధించాలి. ఆరు శాతం, అంతకు మించి ఎక్కువ శాతం ఓట్లు సాధించిన అభ్యర్థులకు చెల్లించిన డిపాజిట్లను తిరిగి చెల్లిస్తారు. ఆరు శాతం ఓట్లు కూడా సాధించలేని అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతే..(అంటే నగదు వెనక్కి రాదు)


నామినేషన్ వేస్తున్న వాసుబాబు

వైసిపి ఉంగుటూరు అభ్యర్థి వాసుబాబు నామినేషన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైసిపి ఉంగుటూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) గురువారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌కెఎన్ ఖాజావలీకి అందజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బాతు నాగేశ్వరరావు, జనసేన తరపున పత్సమట్ల ధర్మరాజు, జాతీయ జనసేన తరపున పెద్దపూడి ధర్మరాజు నామినేషన్లు వేశారు. దీంతో ఆఖరి రోజు మూడు నామినేషన్లు పడినట్లు ఆర్ఒ తెలిపారు.

వైసిపి తాడేపల్లిగూడెం అభ్యర్థి కొట్టు నామినేషన్

తాడేపల్లిగూడెం: వైసిపి తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థిగా కొట్టు సత్యనారాయణ రెండు సెట్లు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ కె.చెన్నయ్యకు ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం అందజేశారు. కొట్టు సత్యనారాయణ వెంట వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరు ఉమాబాల, మాజీ ఎంఎల్‌ఎ ఈలి నాని, అప్సడ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం, మాజీ ఎంఎల్‌ఎ పసల కనకసుందరరావు ఉన్నారు. తొలుత కొట్టు సత్యనారాయణ నివాసం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కొట్టు సత్యనారాయణ పెద్దఎత్తున ర్యాలీగా ఆర్‌డిఒ కార్యాలయానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో భారీగా అభిమానులు, నేతలు పాల్గొన్నారు.


నామినేషన్ వేస్తున్న కొట్టు సత్యనారాయణ

కాంగ్రెస్ తాడేపల్లిగూడెం అభ్యర్థిగా బాబ్జి నామినేషన్

నామినేషన్ వేస్తున్న బాబ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ భవిష్యత్తు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇండియా వేదికతోనే సాధ్యమని కాంగ్రెస్ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి మార్నిడి శేఖర్ (బాబ్జి) తెలిపారు. సవిత్రు పేటలోని ఆయన నివాసం నుంచి అభిమానులుతో కలిసి ర్యాలీగా బయలుదేరి తాడేపల్లిగూడెం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ కె.చెన్నయ్యకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ పోలీసు ఐ ల్యాండ్ వద్ద సిపిఎం నాయకులు కర్రి నాగేశ్వరరావుతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కర్రి నాగేశ్వరరావు మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి మార్నిడి బాబ్జిని గెలిపించాలని కోరారు. మార్నిడి విజయానికి సిపిఎం తరపున సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై నేతలను నిలదీయండి

జన చైతన్య యాత్రలో వక్తలు, కళాకారులు

చింతలపూడిలో జన చైతన్య యాత్ర

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రస్తుత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాల గురించి ఓటు కోసం వచ్చే పార్టీల నేతలను నిలదీయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు సింగోతి నాగేంద్రరావు, కొండా దుర్గారావు అన్నారు. నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకూ ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు 20 రోజులపాటు సాగుతున్న జన చైతన్య యాత్ర గురువారం ఉదయం చింతలపూడి చేరుకుని ప్రధాన కూడలిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని విభజిస్తూ ఆనాటి కేంద్ర ప్రభుత్వం శ్రీకృష్ణ కమిటీ నివేదిక ఆధారంగా అనేక హామీలిచ్చిందని, తరువాత అధికారంలోకి వచ్చిన ఆ హామీలు అమలు చేయలేదన్నారు. ప్రజలు ఈ సమస్యలపై పార్టీలను నిలదీయడంతో పాటు ఎన్నికల అనంతరం ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జెఎస్.భాస్కర్, కొండా రాము, బి.రమేష్, ప్రగతిశీల మహిళ సంఘం, స్త్రీ విముక్తి నాయకురాలు బి.గంగ పాల్గొన్నారు.

ఆఖరి రోజు నామినేషన్లు ఇలా..

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చివరి రోజు గురువారానికి ఏడుగురు అభ్యర్థులు, 9 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో వైసిపి తరపున ఇద్దరు అభ్యర్థులు కొఠారు రామచంద్రరావు రెండు సెట్లు, కొఠారు అబ్బయ్య చౌదరి రెండు సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆలపాటి నరహింహమూర్తి ఒక నామినేషన్ సెట్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా నూతి రవీంద్ర ఒక సెట్టు, నూతి నాగరాజు ఒక సెట్టు, పచ్చిగోళ్ల జాన్ ధర్మరాజు ఒక సెట్టు, చెరుకూరి శ్రీరామ్ కుమార్ ఒక సెట్టు దాఖలు చేశారు. ఈ నామినేషన్లు ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు అభ్యర్థుల సమక్షంలో దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పరిశీలిస్తారని రిటర్నింగ్ అధికారి లావణ్య వేణి తెలిపారు. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ ఉపసంహరించుకోదలచిన అభ్యర్థులు రిటర్నింగ్ అధికారికి అందజేయొచ్చన్నారు.

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గంలో గురువారం ఆరు నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారి అద్దయ్య తెలిపారు. కాంగ్రెస్ నుంచి ఉన్నమట్ల ఎలిజా, ఉన్నమట్ల జీవన్ ప్రభాకర్, స్వతంత్ర అభ్యర్థులు టి.శ్రీనివాసరావు, టిడిపి నుంచి సొంగా ఇస్సాక్, రాజ్, వైసిపి నుంచి కంభం విజయరాజు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఇప్పటివరకూ 26 నామినేషన్లు వేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 12 మంది అభ్యర్థులు 22 నామినేషన్ వేసినట్లు తెలిపారు.

ఆచంట:శాసనసభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు దాఖలు ఘట్టం గురువారంతో ముగిసింది. ఆచంట నియోజకవర్గంలో మొత్తం 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఆఖరి రోజు గురువారం 8 మంది నామినేషన్ వేసినట్లు ఎన్నికల అధికారి వి.స్వామినాయుడు తెలిపారు. మొత్తం 26 సెట్లు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల సహాయ అధికారి ఐపి శెట్టి తెలిపారు.

నరసాపురం : నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి గాను గురువారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఆర్ఒ, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ తెలిపారు. జనసేన నుంచి బొమ్మిడి నారాయణ నాయకర్, కాంగ్రెస్ తరపున కానూరి ఉదయ భాస్కర కృష్ణప్రసాద్, భారత చైతన్య యువజన పార్టీ తరపున ఆకుల వెంకట స్వామి, నవరంగ్ కాంగ్రెస్ తరపున కొల్లి సత్యనాయకర్, స్వతంత్ర అభ్యర్థులుగా గాది రవి, లోకం శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు.

పాలకొల్లు : నామినేషన్ల చివరి రోజు గురువారం పాలకొల్లు నియోజకవర్గ ఎంఎల్ఎ స్వతంత్ర అభ్యర్థులుగా నల్లి రాజేష్ రెండు సెట్లు, పాలపర్తి జాన్సన్ ఒక సెట్టు నామినేషన్ మున్సిపల్ ఆఫీస్ నందు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు.



మాట్లాడుతున్న శివ

రైతుల సమస్యలపై పోరాడతా : శివ

ప్రజాశక్తి - ఉండి

రైతాంగ సమస్యలపై రైతుల పక్షాన అసెంబ్లీలో పోరాడతానని మాజీ ఎంఎల్ఎ, టిడిపి రెబల్ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. గురువారం టిడిపి రెబల్ ఉండి నియోజకవర్గ అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం శివరామరాజు మాట్లాడారు. నియోజకవర్గంలో ఇటీవల కాలంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, గిట్టుబాటు ధర లేక ఆక్వాకు క్రాప్ హాలిడే ప్రకటించే దిశగా ఆక్వా రైతులు ఆలోచిస్తున్నారని, వారందరికీ న్యాయం చేసేందుకు రైతుల పక్షాన అసెంబ్లీలో పోరాడతానని తెలిపారు. నియోజకవర్గంలో తన కాలంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా తాను విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా మండుటెండలో అర్ధనగ్న దీక్షను చేయడంతోనే నాటి నుండి నియోజకవర్గంలో విద్యుత్ కోతలు లేవన్నారు. శివరామరాజు వెంట కలవపూడి సర్పంచి గేదెల జాన్, ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, టిడిపి నాయకులు మోపిదేవి శ్రీనివాస్, నడింపల్లి వెంకటరాజు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

ప్రజాశక్తి - కైకలూరు

నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. కైకలూరు నియోజకవర్గానికి 44 సెట్ల నామినేషన్లు పడ్డాయి. వీటిలో ఇండియా వేదిక బలపర్చిన బొడ్డు నోబుల్, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్, వైసిపి అభ్యర్థిగా దూలం నాగేశ్వరరావు నామ పత్రాలు సమర్పించారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున లావేటి వీరశివాజీ, బిఎస్‌పి అభ్యర్థులు పోటీ చేశారు. ఆఖరి రోజున ఏడుగురు తమ నామినేషన్లను సమర్పించారు. భారతీయ జనతా పార్టీ తరపున కామినేని శ్రీనివాస్ సతీమణి కామినేని మనోరమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఎక్కువ మంది నామినేషన్ పత్రాలు సమర్పించారు.

గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తా

స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి తనతోనే సాధ్యమని మాజీ ఎంఎల్ఎ, నూజివీడు స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి మండలంలో చొప్పరమెట్ల, అమ్మవారిగూడెం, నరసింగపాలెం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో అనేక దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. డివిజన్ కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా కనీస అభివద్ధికి నోచుకోని పరిస్థితి ఉందన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా తనను గెలిపిస్తే రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఒత్తిడి తీసుకువచ్చి నూజివీడు నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు తాగునీటి సరఫరా వంటి కార్యక్రమాలను గెలిచిన సంవత్సరంలోపు పూర్తిచేసి తీరతానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అందరి బాధ్యత : ఆర్ఒ

ప్రజాశక్తి - ఆచంట

ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. ఓటు హక్కు అందరూ బాధ్యత అనే నాదంతో గురువారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యపర్చారు. ఈ ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్, కచేరీ సెంటర్, ఆచంట పురవీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర భవిష్యత్తుకు ఓటే పునాది అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజాభివృద్ధే ధ్యేయంగా పని చేసే వారికి ప్రాధాన్యతివ్వాలనే ఆలోచన నేటి యువతలో కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్, తహశీల్దార్ ఐపి.శెట్టి, పంచాయతీ కార్యదర్శి జివి.నం ్సింహారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

ఎన్నికల పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏలూరు జిల్లాకు సంబంధించి సాధారణ పరిశీలకులుగా వ్యవహరిస్తున్న కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఎ.రామన్ ప్రజలకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఏలూరు కలెక్టరేట్ సమీపంలో రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో అందుబాటులో ఉంటారని గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమీపంలో రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో ఉదయం 11.30 గంటల్లోపు సాయంత్రం 5 గంటల తరువాత కృష్ణకాంత్ పాఠక్, ఉదయం 11.00లోపు, సాయంత్రం 5 గంటల తరువాత ఎస్ఎ. రామన్ అందుబాటులో ఉండి విజ్ఞప్తులను స్వీకరిస్తారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు నేరుగా గానీ, లేదా ఫోన్ ద్వారా గానీ తెలియాలని తెలిపారు.

16 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

2024 సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీతో ముగిసింది. 25వ తేదీ గురువారం పోలవరం నియోజకవర్గానికి సంబంధించి ఐటిడిఎ కెఆర్‌పురం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజకు ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ మొత్తం 34 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. 25వ తేదీ ఒక్కరోజే 16 నామినేషన్లు నమోదు కావడం విశేషం. 25న ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థిగా దువ్వెల సృజన, స్వతంత్ర అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కర్రెద్దుల కమల కుమారి కుమార్తె కర్రెద్దుల హేమమాలిని, జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజు, భారతీయ ఆదివాసీ పార్టీ నుంచి మొడియం శ్రీనివాసరావు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం.సూర్య తేజకు అందజేశారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు మీడియాతో మాట్లాడారు.

నాడు పోరాటంలో లేనివారు దేశభక్తులా

(మొదటి పేజీ నుంచి)

ఉన్నదన్నారు. ప్రపంచ ఆకలి సూచికలో మన దేశం 120వ స్థానంలో ఉందని తెలిపారు. ఇది గమనించిన పాలకులు 82 కోట్ల మందికి ఐదు సంవత్సరాలపాటు ప్రతినెలా ఐదు కిలోల ఉచిత బియ్యాన్ని పంపిణీ చేయాలనుకున్నారంటే భారతదేశం మెరిసిపోతుందా, ప్రపంచంలో అతివేగంగా అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని, విషప్రయోగం జరుగుతుందని, ముస్లిం, క్రైస్తవులు, హిందువుల మధ్య మత చిచ్చులు పెడుతున్నారన్నారు. ఈ సదస్సులో దారి దీపం పత్రిక సంపాదకులు డివివిఎస్.వర్మ, సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పి.మురళీకుమార్, పి.దక్షిణామూర్తి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆలిండియా లాయర్స్ యూనియన్, జన విజ్ఞాన వేదిక, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, భారత్ బచావో, చైతన్య వేదిక, పౌర హక్కుల సంఘం, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో 'భారతదేశం వెలిగిపోతుందా' అనే అంశంపై జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎన్.రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ పౌరసంఘాలు ప్రచురించిన నయవంచన అనే పుస్తకాన్ని పరకాల ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పుస్తకంలోని అంశాలను పరిచయం చేస్తూ కేంద్ర ప్రభుత్వ పది సంవత్సరాల నిరంకుశ పాలన, 10 దారుణ మోసాలు, ధరల పెరుగుదల, రైతాంగ సంక్షోభం, నిరుద్యోగ సంక్షోభం, దేశాన్ని కొల్లగొడుతున్న కార్పొరేట్లు, అవినీతి తదితర అంశాలను గురించి పుస్తకంలో ఏ విధంగా ప్రచురించారో వివరించారు. అనంతరం ముఖ్య వక్త పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోని ఒక శాతం పెద్దల చేతిలో 45 శాతం సంపద ఉన్నప్పటికీ పెట్టుబడులు రావడం లేదని, దాని ద్వారా ఉపాధి అవకాశాలు లేక ప్రతియేటా లక్షలాది మంది దేశం విడిచి వెళ్లిపోతున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు గురించిగాని, పరిశ్రమల గురించి గాని, ఉద్యోగాల గురించిగాని చెప్పదుగాని మందిరాలు, మసీదులు, మతాల గురించి చెప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మళ్లీ ఇదే పార్టీ అధికారంలోకి వస్తే మున్ముందు ఇంకా ఎన్నికలు ఉండవని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలో ప్రజలే ఆలోచించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, రిటైర్డ్ జడ్జి లక్ష్మి, ఐలు నాయకులు కట్టా సత్యనారాయణ, ఓరుగంటి శైలజ, భారత్ బచావో నాయకులు గుబ్బల నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హాట్‌టాపిక్‌గా దెందులూరు నియోజకవర్గం

ఏలూరు జిల్లాలో దెందులూరు నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఇక్కడ నుంచి 2009, 2014లో రెండుసార్లు ఎంఎల్ఎగా గెలిచిన చింతమనేని ప్రభాకర్ 2019లో వైసిపి అభ్యర్థి అబ్బాయిచౌదరి చేతిలో ఓటమిచెందారు. దెందులూరు నియోజకవర్గం తనకు కంచుకోట అని చెప్పుకునే చింతమనేని ఓటమి అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ప్రస్తుత ఎన్నికల్లో చింతమనేనికి టిడిపి టిక్కెట్ వస్తుందా, లేదా అనే చర్చ విస్తృతంగా సాగింది. తొలుత చింతమనేనికి కాకుండా ఆయన కుటుంబ సభ్యులకు ఇస్తారని, తర్వాత ఆయనకు ప్రకటించిన తర్వాత సైతం పొత్తులో భాగంగా బిజెపికి ఇస్తారంటూ మల్లగుల్లాలు సాగాయి. నామినేషన్ల గడువు ముగిసే రెండురోజుల ముందే ఆయన టిడిపి బిఫారం అందుకున్నారు. ఈ నియోజకవర్గంలో చింతమనేని, కొఠారు అబ్బాయిచౌదరి సైతం నువ్వా నేనా అన్నట్లు పోటీపడుతున్నారు. ఇరువురు నాయకులు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్న పరిస్థితి నెలకొంది. జూన్ నాలుగో తేదీన ఆయా నియోజకవర్గాల్లో ఎవరి భవితవ్యం ఏమిటో తేలిపోనుంది.

ఆ నాలుగుపైనే..అందరి దృష్టి..!

(మొదటి పేజీ నుంచి)

ఇక్కడ గెలుపోటములపైనా పందేలు పెద్దఎత్తున సాగుతున్నాయి.

హాట్‌టాపిక్‌గా దెందులూరు నియోజకవర్గం

ఏలూరు జిల్లాలో దెందులూరు నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఇక్కడ నుంచి 2009, 2014లో రెండుసార్లు ఎంఎల్ఎగా గెలిచిన చింతమనేని ప్రభాకర్ 2019లో వైసిపి అభ్యర్థి అబ్బాయిచౌదరి చేతిలో ఓటమిచెందారు. దెందులూరు నియోజకవర్గం తనకు కంచుకోట అని చెప్పుకునే చింతమనేని ఓటమి అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. ప్రస్తుత ఎన్నికల్లో చింతమనేనికి టిడిపి టిక్కెట్ వస్తుందా, లేదా అనే చర్చ విస్తృతంగా సాగింది. తొలుత చింతమనేనికి కాకుండా ఆయన కుటుంబ సభ్యులకు ఇస్తారని, తర్వాత ఆయనకు ప్రకటించిన తర్వాత సైతం పొత్తులో భాగంగా బిజెపికి ఇస్తారంటూ మల్లగుల్లాలు సాగాయి. నామినేషన్ల గడువు ముగిసే రెండురోజుల ముందే ఆయన టిడిపి బిఫారం అందుకున్నారు. ఈ నియోజకవర్గంలో చింతమనేని, కొఠారు అబ్బాయిచౌదరి సైతం నువ్వా నేనా అన్నట్లు పోటీపడుతున్నారు. ఇరువురు నాయకులు గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్న పరిస్థితి నెలకొంది. జూన్ నాలుగో తేదీన ఆయా నియోజకవర్గాల్లో ఎవరి భవితవ్యం ఏమిటో తేలిపోనుంది.

మలేరియా నివారణకు సమిష్టి కృషి అవసరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పట్టణంలో వీకర్స్ కాలనీ, ఎన్‌టిఆర్ జంక్షన్, కదకట్ల, యాగర్లపల్లి పరిధిలోని ఆరోగ్య కేంద్రాల వద్ద మలేరియాపై గురువారం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రావ్య మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా సమానత్వం కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని ఉధృతం చేద్దాం, మలేరియా కేసులను జీరో (సున్నా)గా తీసుకురావడానికి కొత్త ఆలోచనలతో, సమిష్టి భాగస్వామ్యంతో అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. మలేరియ కేసులను సున్న స్థాయికి తీసుకురావడానికి అందరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధి కారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అనిషా, డాక్టర్ తనూజ పాల్గొన్నారు.

మొగల్తూరు : దోమల నివారణకు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు దినేష్‌కుమార్ సూచించారు. మండలంలోని గ్రామాల్లో గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకున్న సిబ్బంది అవగాహన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వైద్యులు దినేష్‌కుమార్ మాట్లాడారు. దోమల నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీపార్వతి, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ :లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహనా సదస్సు, ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం ద్వారా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, మలేరియా సబ్ యూనిట్ అధికారి కె.రాజ్‌కుమార్, పిహెచ్‌ఎన్.ఎలిజిబెత్ పాల్గొన్నారు.

గణపవరంలో అవగాహనా ర్యాలీ

గణపవరం :దోమల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోష్‌నాయుడు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గణపవరం వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్‌నాయుడు మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి, కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు, హెచ్‌వి.పద్మజ పాల్గొన్నారు.

ముఖ్య వార్తలు

శుక్రవారం 26 ఏప్రిల్ 2024

ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని సత్యవరం గ్రామంలో మదర్ థెరిస్సా స్ఫూర్తితో బేతేస్థ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ముప్పిడి కృపానందం బాబు గురువారం ప్రారంభించారు. మదర్ థెరిస్సా ప్రజలకు ఎనలేని సేవలందించిన రీతిలోనే అదే బాటలో నడుస్తూ ప్రజలందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని మెడికల్ ప్రాక్టీషనర్ ముప్పిడి రాహుల్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలాజీ ల్యాబ్ అధినేత కర్రి నరేంద్రరెడ్డి, జీవరత్నం, ప్రియా, పులుగోరు నాగవేణి, అనిల్, తానేటి రత్నజ్యోతి, రిషి, ఖండవల్లి సోనాలి, రష్మిక, వర్షిత్, తాడి కుమారి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి నాయకులు కోరారు. ఈ మేరకు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి డిసిహెచ్ఎస్ డాక్టర్ జి.సూర్యనారాయణకు గురువారం వినతిపత్రం అందించారు. ఎఐటియుసి అనుబంధ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వాసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు మాట్లాడుతూ సిబ్బందికి వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, మెడికల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కూడా ఆప్ కాస్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డాక్టర్ సూర్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి కాంట్రాక్టింగ్ ఏజెన్సీతో మాట్లాడతామని, సమస్యల పరిష్కారం దిశగా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. మిగిలిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బుజ్జి

నరసాపురం :ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన ధాన్యం మిల్లుకు తరలించేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కర కృష్ణప్రసాద్ (బుజ్జి) అన్నారు. మండలంలోని లిఖితపూడి, కొప్పర్రు, మల్లవరం, మల్లవరంలంక గ్రామాల్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ రైతుల సమస్యలు తీరాలంటే హస్తం గుర్తుకు ఓట్లు వేయాలన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి బాబ్జి, మల్లిపూడి శ్రీనివాస్, సాధనల చిన్ని, ఎం.సాల్మన్, కె.అమర్, రఘురాం పాల్గొన్నారు.

ఉండిని అభివృద్ధి పథంలో నడుపుతా

స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడుపుతానని స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేసేందుకు కలవపూడి గ్రామం నుంచి ఆయన ర్యాలీగా బయలుదేరారు. తొలుత కలవపూడిలో శివరామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధే తన అజెండాగా ముందుకు వస్తున్నాన్నారు. ర్యాలీలో పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ ర్యాలీలో కలవపూడి సర్పంచి గేదెల జాన్, వేగేశ్న బాలగణపతివర్మ, అల్లూరి అచ్యుతరామరాజు, మంతెన శ్రీవెంకటరాజు పాల్గొన్నారు.

ఆకివీడు : ఉండి స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు నామినేషన్‌కు తరలి వెళ్లేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. మండల శివారు చెరుకుమిల్లి గ్రామం నుంచి ఈ ర్యాలీ ప్రారంభమైంది. ఆకివీడు మెయిన్ సెంటర్ నుంచి ర్యాలీకి సాగేందుకు పోలీసులు ట్రాఫిక్‌ను గ్రామం చివర నుంచి బైపాస్ రోడ్డు కాలువ గట్టుకు మళ్లించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

'ఎస్‌సిలకు నిమ్మల ప్రాధాన్యత'

ప్రజాశక్తి - పోడూరు

పాలకొల్లు నియోజకవర్గంలో అన్ని తరగతుల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఎస్‌సిలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పని చేస్తారని ఆయన సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. మండలంలోని అప్పన్నచెరువు గ్రామంలో గురువారం ఆమె ప్రచారం నిర్వహించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఎస్‌సిలకు అమలయ్యే పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు.

నాయకర్ ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని వేములదీవి తూర్పు గ్రామంలో జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ గురువారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనను, బిజెపి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌వర్మను గెలిపించాలని కోరారు. టిడిపి కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, అంగ్రాజు రామన్న, చెంపాటి సత్యనారాయణ రాజు, బస్వాని ఏడుకొండలు, తంగెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మరోసారి గెలిపించండి

విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మీతోనే ఉన్నాను, మీ వెంటే ఉంటున్నానని, ప్రజలంతా ఆదరించి మరోసారి గెలిపించాలని విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కోరారు. భీమవరం ఒకటో వార్డులో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గాన్ని మెట్రో సిటీ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి వార్డులోను సీసీ రోడ్లు, డ్రెయినేజీలు మరెన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి తనను, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ప్రజలు అఖండ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ మేడిది జాన్సన్, గ్రంధి రవితేజ, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు,

మొగల్తూరులో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న శ్రీ దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావారిని యాత్రికులు దర్శించుకుని అన్న సమారాధనలో పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇండియా వేదికతోనే రాష్ట్రానికి పూర్వ వైభవం

కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ఇండియా వేదిక అధికారంలోకొచ్చాక రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం ఆకివీడులో ప్రధాన వీధుల గుండా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పుడు రాష్ట్రం ఎంతో అభివృద్ధిలో ఉండేదని, తిరిగి ఆ దశకు రావాలంటే ఇండియా వేదికకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.తవిటినాయుడు, వర్మ, దోకల రవి పాల్గొన్నారు.



వాహనంపై ప్రచారం చేస్తున్న గోపాలకృష్ణంరాజు

ఉత్తమ విద్యార్థినులకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - పెనుమంట్ర

పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపి 587 మార్కులతో ప్రయివేట్ పాఠశాలల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థిని అబ్బినేని మాన్వితను పాఠశాల తరపున గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ద్వితీయ స్థానం పొందిన భట్టు బిందుహారిణి(571), తృతీయ స్థానంలో నిలిచిన పొన్నపల్లి శ్రీవల్లి (570), తేతలి లక్ష్మీ కావేరి (570)లను స్కూల్ కార్యదర్శి, కరస్పాండెంట్ తేతలి సంజీవరెడ్డి మెమెంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అకడమిక్ డైరెక్టర్ టి.హెలెన్, ఉపాధ్యాయులు ఎం.ఐశ్వర్య, వి.రమ్య, ఎ.భవాని, ఎంఎస్.యున్షైన్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంతోనే బిసిలకు లబ్ధి

నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాల

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పేదల పక్షపతి, నిరంతరం పేదల అభివృద్ధి కోరుకునే జగన్‌తోనే బిసిలకు సరైన లబ్ధి చేకూరుతుందని వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. మండలంలోని వెంప దిసుమర్రు, ఎల్‌విఎన్.పురం, రాయడం గ్రామాల్లో నిర్వహించిన బిసిల సమావేశాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బిసిలకు సంక్షేమ పథకాలతో పాటు రాజ్యాధికారం అందించాలని సిఎం జగన్ జరగబోయే ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా ఏ పార్టీ కేటాయించని విధంగా ఎంపీ, ఎంఎల్ఎ స్థానాలను బిసిలకు కేటాయించారన్నారు. ప్రత్యేక సంక్షేమ పథకాలు కూడా ప్రవేశపెట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో బిసిలంతా ఒక తాటిపైకి వచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఆమెతో పాటు జెడ్‌పిటిసి సభ్యులు నరసింహారావు, దిరుసుమర్రు గ్రామ సర్పంచి కోళ్ల బాలకృష్ణ, సానబోయిన సత్యనారాయణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, బిసి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

గ్రంథాలయం 12 గంటలూ అందుబాటులో ఉంచాలి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి నిరుద్యోగుల వినతి

ప్రజాశక్తి - నరసాపురం

చదువుకునేందుకు గ్రంథాలయాన్ని 12 గంటలూ అందుబాటులో ఉంచాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబుకు నిరుద్యోగులు వినతిపత్రం అందించారు. పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలో దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు పత్రికా విభాగంతో పాటు పుస్తక విభాగం వారు చదువుకోవడానికి వీలుగా 12 గంటలు నిర్వహణ ఉండాలని నిరుద్యోగులు కోరారు. అనంతరం శేఖర్‌బాబు సర్ ఆర్థర్ కాటన్ పార్కులో నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి, గ్రంథాలయ కమిటీ సభ్యులు ఎం.సుధీర్‌మోహన్, సూర్యం బాబు, శ్రీనివాసు, జీవన్ కుమార్ పాల్గొన్నారు.

పశ్చిమ బరిలో 129 మంది అభ్యర్థులు

నరసాపురం ఎంపీ స్థానానికి 27 మంది
ఏడు అసెంబ్లీ స్థానాలకు 102 మంది
మొత్తం 203 సెట్ల నామినేషన్లు
జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమగోదావరి జిల్లా బరిలో 129 మంది అభ్యర్థులు నిలిచారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ముగిసింది. నరసాపురం ఎంపీ స్థానానికి 27 మంది అభ్యర్థులు, ఏడు అసెంబ్లీ స్థానాలకు 102 మంది అభ్యర్థులు మొత్తం 203 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు నర్సాపురం ఎంపీ స్థానానికి 12 మంది అభ్యర్థులు 18 సెట్లు నామినేషన్లను దాఖలు చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 67 మంది అభ్యర్థులు 73 సెట్లు నామినేషన్లను వేశారు. భీమవరం అసెంబ్లీ స్థానంలో ఎనిమిది మంది అభ్యర్థులు ఎనిమిది సెట్లు నామినేషన్లు వేశారు. తాడేపల్లిగూడెంలో 15 మంది అభ్యర్థులు 16 సెట్లు నామినేషన్లు, నరసాపురంలో ఏడుగురు ఏడు సెట్లు నామినేషన్లను దాఖలు చేశారు. ఆచంటలో ఎనిమిది మంది అభ్యర్థులు తొమ్మిది సెట్లు నామినేషన్లు, తణుకులో ఆరుగురు అభ్యర్థులు ఏడు సెట్లు నామినేషన్లు, ఉండిలో పది మంది అభ్యర్థులు పది సెట్లు నామినేషన్లు, పాలకొల్లులో 13 మంది అభ్యర్థులు 16 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ప్రకటించారు.

అంగన్వాడీలకు వేసవి సెలవులు ప్రకటించరూ..!

ప్రజాశక్తి - పెనుమంట్ర

వేసవి ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నందున అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని చిన్నారుల తల్లిదండ్రులు పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికే అంగన్వాడీలకు ఒంటిపూట బడులను ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తున్నారు. అయితే ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రమై, వడగాల్పులు వీస్తున్నాయని, అందువల్ల ఐదు సంవత్సరాల్లోపు వయస్సు ఉండే చిన్నారులను అంగన్వాడీలకు పంపడం ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. వెంటనే అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని ప్రభుత్వాన్ని వారు కోరుతున్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరులో వెంకటేశ్వరస్వామి ఆలయంలో మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. వేసవిలో యాత్రికులతో స్థానికులతోపాటు గ్రామం మీదుగా ఇతర ప్రాంతాల నుండి రాకపోకలు సాగించే ప్రయాణికులకు దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ప్రతి వేసవిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యాత్రికులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించుకోవాలి

మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణ ప్రజలందరూ ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థల్లో సెప్టిక్ ట్యాంకులు నిండిపోయినప్పుడు ఓవర్ ఫ్లో కాకముందే లైసెన్స్ పొందిన వారితో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. కేంద్రగృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో గురువారం జాతీయస్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మన రాష్ట్రం నుండి నరసాపురం, బొబ్బిలి మున్సిపాల్టీల నుంచి పాల్గొన్నారు. పట్టణాల్లో సెప్టిక్ ట్యాంకుల నిర్వహణ పద్ధతులు, ప్రయివేట్ లైసెన్స్ ఆపరేటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలపై చర్చించారు. క్లీనింగ్ కార్యక్రమం సక్రమంగా నిర్వహిస్తున్న కార్మికులను కమిషనర్ వెంకటేశ్వరరావు సన్మానించారు. కార్యక్రమంలో ఎఇ మణి పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - మొగల్తూరు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అబ్జర్వర్ శైలేష్‌కుమార్ సిన్హా పోలీసు అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని మొగల్తూరు, పేరుపాలెంలోని కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎటువంటి ఇబ్బందులకూ గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా బందోబస్తు నిర్వహించాలన్నారు. ఆయన వెంట డిఎస్‌పి జి.శ్రీనివాసరావు, రూరల్ సిఐ జి.గోవిందరాజు, విఆర్ సిఐ జి.కాళీచరణ్, సిఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామాంజీ, ఎస్ఐలు కె.వెంకటరమణ, కె.గుర్రయ్య ఉన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్ఎ.రామన్

ప్రజాశక్తి - నూజివీడు

ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్ఎ.రామన్ అన్నారు. నూజివీడు ఆర్‌డిఒ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. కార్యాలయంలో సి-విజిల్, ఎంసిసి, వ్యయ పరిశీలకులు తదితర విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామన్‌కు ఆర్‌డిఒ భవాని శంకరి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామన్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలపై పోటీ చేసే అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ప్రజలను ఎటువంటి ప్రలోభాలకూ లోను చేయకుండా, ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలకు సంబంధించి ఖర్చులను సంబంధిత అభ్యర్థి ఎన్నికల ఖర్చుల ఖాతాలో నమోదు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి సి.విజిల్ తదితర వాటి

రామన్‌కు మొక్క అందిస్తున్న భవానిశంకరి

ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కైకలూరు: అధికారులు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీ నేతలు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ప్రత్యేక పరిశీలకులు ఎస్ఎ.రామన్ అన్నారు. గురువారం ఆయన కైకలూరులోని తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి నామినేషన్ ప్రక్రియ, ఎన్నికల ఖర్చులు, పోలింగ్ బూత్‌ల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్‌కు పలు సూచనలు చేశారు.

దోమలు సమాజానికి పెనుముప్పు

డిఎంహెచ్ఒ ఎస్.శర్మిష్ఠ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దోమలు సమాజానికి పెను ముప్పుగా పరిణమించాయని, వాటి నిర్మూలనకు ప్రజల సహకారంతోనే సాధ్యమని ఏలూరు డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక డిఎంహెచ్ఒ ప్రాంగణంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బందితో అవగాహనా కార్యక్రమం, ర్యాలీ ఉద్దేశించి మాట్లాడారు. మలేరియా జ్వరం దోమ నుంచి మనిషికి సంక్రమిస్తుందని సర్ రోనాల్డ్‌రాస్ అనే బ్రిటీష్ వైద్యుడు కనుగొన్నారని, దీంతో మలేరియా మరణాలు అరికట్టారని తెలిపారు. ఏలూరు జిల్లాలో గత సంవత్సరం 40 కేసులు నమోదవ్వగా, ఈ సంవత్సరం కేవలం 13 కేసులే నమోదయ్యాయన్నారు. దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. గిరిజన ప్రాంతాల్లో సంవత్సరానికి రెండుసార్లు మలాథియన్ స్ప్రే చేయిస్తున్నట్లు, రానున్న వర్షాకాలానికి ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గంబూషియా చేపలు విడుదల, దోమతెరలు వాడకం ద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాలు తగ్గించుకోవచ్చని సూచించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.మాలతి మాట్లాడుతూ ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ ఏడాది ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదని, ప్రతిరోజూ మురుగుకాల్వల్లో ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నామని చెప్పారు. సాయంత్రం సమయంలో ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ఒ జ్యోతి, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రమేష్, దుర్గారావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నినదిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - ఏలూరు

టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందన సభ స్థానిక అన్నే భవనంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో పది, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కేక్ కట్ చేయించి నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ డి.కిషోర్, ఏలూరు కార్పొరేషన్ డిఇ పి.కొండలరావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. సభలో అతిథులు డి.కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులుగా ఉన్నప్పుడు చదువుతోపాటు కొత్త అంశాలు నేర్చుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. కేవలం మార్కుల ఆధారంగానే మంచి భవిష్యత్తు ఉండదని అర్థం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ డిఇ పి.కొండలరావు మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీల వివరాలు తెలుసుకుని తక్కువ ఖర్చుతో మంచి విద్యను పొందడానికి ప్రయత్నం చేయాలన్నారు. పరీక్షా ఫలితాల్లో సాధించిన మార్కుల ఆధారంగా మరింత అభివృద్ధి కావడం కోసం ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణను వినియోగించుకోవాలని అన్నారు. అభినయ నృత్యభారతి ప్రధాన కార్యదర్శి డి.హేమసుందర్ మాట్లాడుతూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ, హేలాపురి బాలోత్సవం, ట్యూషన్ సెంటర్ రెగ్యులర్‌గా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏలూరు స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్‌వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తక్కువ మార్కులు వచ్చిన వారు నిరాశ పడొద్దని, నచ్చిన కోర్సును ఎంపిక చేసుకుని ముందుకు సాగాలన్నారు. శిక్షణ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న వారిలో టెన్త్, పదో తరగతి, ఇంటర్ పాస్ అయిన 30 మందికి మానవత జిల్లా కమిటీ ముద్రించిన డిక్షనరీలు, చిరుకానుకలు అందించారు. కార్యక్రమంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థినికి కానుక అందిస్తున్న ప్రముఖులు

అట్టహాసంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నామినేషన్

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

అభ్యర్థి కెబిఆర్.నాయుడు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రానికి ప్రత్యేక హోదాం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నరసాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు. అన్నారు. నర్సాపురం ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ఎస్ఆర్‌కెఆర్ కాలేజ్ దగ్గర రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ ప్రారంభించారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెబిఆర్.నాయుడు మాట్లాడుతూ దేశంలో బిజెపి అరాచక పాలన పట్ల ప్రజలు విసుగు చెందారన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపన సుబ్రహ్మణ్యరాజు (జెఎస్ఆర్), రాష్ట్ర అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, పశ్చిమగోదావరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోమునాగ కేశవ్ బాబు, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు చింతగుంట మహేష్, రాష్ట్ర కార్యదర్శి దుండి రవివర్మ, యూత్ పట్టణ అధ్యక్షులు బోణం రవికుమార్, మండల అధ్యక్షులు మణికంఠ, నేతలు ముత్యం విజయకుమార్, పాకెర్ల బాబ్జి, కురెళ్ల సాయి వెంకటరామరాజు పాల్గొన్నారు.

జగన్ ఇంటికే

టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపుతారని నరసాపురం ఎంపీ, టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. గురువారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి కూటమి 150 స్థానాలతో తిరుగులేని విజయాన్ని సాధించడం ఖాయమన్నారు. నాసిరకమైన మద్యం వల్ల మగువల మాంగళ్యాలు తెగిపోతున్నాయన్నారు. టిడిపి ముసుగులో జగన్మోహన్‌రెడ్డి దగ్గర మాట తీసుకుని, వైసిపి ప్రభుత్వం వస్తే పదవులను అనుభవించాలనుకునే వారిని ఓడించాలని కోరారు. శివరామరాజుకు రెండు రెక్కల ఫ్యాన్ గుర్తు ఇస్తారేమో తెలియదుగానీ ప్రస్తుతానికి ఆయన గుట్టు తెలిసిందని, గుర్తు తెలియదని వ్యాఖ్యానించారు. వైసిపితో కలిసి టిడిపి రెబల్ అభ్యర్థినని చెప్పుకుని తిరిగితే నిజమైన టిడిపి కార్యకర్తలు నమ్మరన్నారు. స్థానిక ఎంఎల్ఎ, టిడిపి జిల్లా అధ్యక్షులు రామరాజే ముందుండి తనను నడిపిస్తున్నారని రఘురామకృష్ణంరాజు తెలిపారు. 2014లో శివ టిక్కెట్ దక్కించుకోవడంలో, విజయం సాధించడంతో తాను కీలక పాత్ర పోషించానన్నారు. ఆయన పార్టీ వీడకుండా అడ్డుకునేందుకు అన్ని ప్రయత్నాలూ చేశానని తెలిపారు. అయితే శివరామరాజు పోటీ చేయడం వల్ల నాకు మేలే జరుగుతుందని తెలిపారు.